## ప్రేమ పేరుతో టోకరా




యువకుడి నుంచి రూ.20 లక్షలు వసూలు చేసిన కిలాడీ మహిళ

05

## చీటీల పేరుతో మోసం

చిట్స్ రూపంలో రూ.1.49 కోట్లు, అప్పుల పేరుతో రూ.3.55 కోట్లు ఛీట్ చేసిన వ్యక్తి అరెస్టు

04

## రాష్ట్రంలో మూడో డిస్కం

05

రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ అని నామకరణం

సీఎండీగా ముషారఫ్ అలీ ఫరూఖీ నియామకం



## 108 మంది మావోల లొంగుబాటు

### వీరిలో 44 మంది మహిళలు

అందరి తలలపై కలిపి రూ.3.29 కోట్ల రివార్డు

భారీగా నగదు, ఆయుధ సామాగ్రి లభ్యం

అక్షరదర్బార్, రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో బుధవారం 108 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరందరూ తమ ఆయుధాలను అధికారులకు అప్పగించి జనజీవన స్రవంతిలో కలిశారు.

—మిగతా 5వ పేజీలో..


సంపుటి :03 | సంచిక :33 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

బుధవారం 11, మార్చి 2026




# గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం

లోక్‌భవన్ వేదికగా వేడుక


హాజరైన సీఎం రేవంత్, మంత్రులు

తెలుగులో ప్రమాణ స్వీకారం చేసిన గవర్నర్

కలిసి పనిచేద్దామని రాష్ట్ర ప్రభుత్వానికి పిలుపు

02

## రామప్ప ఉప ఆలయాలకూ జాతీయ హోదా




భారత పురావస్తు సర్వేక్షణ సంస్కృతి మంత్రిత్వ శాఖ గెజిట్

గొల్లల గుడి, శివతారకేశ్వర ఆలయాలకు మహర్దశ

05

# కడియం శ్రీహరికి పెద్ద ఊరట





ఎమ్మెల్యే అనర్హత పిటిషన్ కొట్టివేత

**స్పీకర్ తీర్పును స్వాగతిస్తున్నా**

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును నేను స్వాగతిస్తున్నా. నాకు ఎమ్మెల్యే అర్హతపై బీఆర్‌ఎస్ నాయకులు దాఖలు చేసిన పిటిషన్లకు ఎలాంటి చట్టబద్ధత లేదు. నేను ఇప్పటికీ బీఆర్‌ఎస్‌లోనే ఉన్నాను. ఆ పార్టీ విధానాలు నచ్చక నేను దూరంగా ఉంటున్నా. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నేను రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నా. అదేం నేరం కాదు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు, నాటి పార్టీ అధినేత కేసీఆర్ ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నప్పుడు లేని నియమాలు ఇప్పుడు ఎందుకు తెరమీదకు వస్తాయి?

_ ఎమ్మెల్యే కడియం

స్పీకర్ ప్రసాద్‌కుమార్ నిర్ణయంపై కడియం హర్షం

కడియం కాంగ్రెస్లో చేరారనడానికి ఆధారల్లేవ్: స్పీకర్

అలాగే.. మరో ఎమ్మెల్యే దానం నాగేందర్ కూ రిలీఫ్

స్పీకర్ నిర్ణయంతో ప్రజాస్వామ్యం ఖూనీ : కేటీఆర్

తెలంగాణ రాజకీయాల్లో గత కొంతకాలంగా ఉత్కంఠ రేపుతున్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌లపై దాఖలైన అనర్హత పిటిషన్లను ఆయన కొట్టివేశారు.

అక్షరదర్బార్, వరంగల్ : ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు బీ ఆర్‌ఎస్ పార్టీకి స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు లేదా ఇతర పార్టీలో చేరినట్లు సరైన ఆధారాలు లేవని స్పీకర్ తన తీర్పులో వెల్లడించారు. సుప్రీంకోర్టు విధించిన గడువు ముగియడానికి కేవలం ఒక్కరోజు ముందు ఈ నిర్ణయం వెలువడటం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. గతంలో ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్, ఇప్పుడు వీరిద్దరికీ కూడా ఊరటనివ్వడంతో మొత్తం పది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులకు తెరపడినట్లయింది. ఈ తీర్పుతో ఎమ్మెల్యే కడియం శ్రీహరికి రాజకీయంగా భారీ ఊరట లభించినట్లయింది.

—మిగతా 2వ పేజీలో..

## కడియం శ్రీహరికి

# బిగ్ రిలీఫ్

- ఎమ్మెల్యే అనర్హత పిటిషన్ కొట్టివేత
- స్పీకర్ ప్రసాద్ కుమార్ నిర్ణయంపై కడియం హర్షం
- కడియం కాంగ్రెస్ లో చేరారనడానికి ఆధారల్లేవ్ : స్పీకర్
- అలాగే.. మరో ఎమ్మెల్యే దానం నాగేందర్ కూ ఊరట
- స్పీకర్ నిర్ణయంతో ప్రజాస్వామ్యం ఖూనీ: కేటీఆర్

**అక్షరదర్బార్, వరంగల్ :**

తెలంగాణ రాజకీయాల్లో గత కొంతకాలంగా ఉత్కంఠ రేపుతున్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌లపై దాఖలైన అనర్హత పిటిషన్లను ఆయన కొట్టివేశారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు బిఆర్ఎస్ పార్టీకి స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు లేదా ఇతర పార్టీలో చేరినట్లు సరైన ఆధారాలు లేవని స్పీకర్ తన తీర్పులో వెల్లడించారు. సుప్రీంకోర్టు విధించిన గడువు ముగియడానికి కేవలం ఒక్కరోజు ముందు ఈ నిర్ణయం వెలువడటం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. గతంలో ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్, ఇప్పుడు వీరిద్దరికీ కూడా ఊరటనివ్వడంతో మొత్తం పది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులకు తెరపడినట్లయింది. ఈ తీర్పుతో ఎమ్మెల్యే కడియం శ్రీహరికి రాజకీయంగా భారీ ఊరట లభించినట్లయింది. అనర్హత వేటు పడుతుందనే భయం తొలిగిపోవడంతో ఆయన శాసనసభ్యుడిగా కొనసాగేందుకు మార్గం సుగమం అయింది. ఉప ఎన్నికల ముప్పు లేకపోవడంతో తన నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఆయన మరింత పట్టు సాధించే అవకాశం ఉంది. అసెంబ్లీలో అధికార పక్షం వైపు నుంచి తన గళాన్ని వినిపించేందుకు ఇప్పుడు ఆయనకు పూర్తి చట్టబద్ధత లభించింది. భవిష్యత్తులో రాజకీయంగా కీలక బాధ్యతలు చేపట్టేందుకు ఈ క్లీన్ చిట్ ఎంతో కీలకం కానుంది. న్యాయపరమైన చిక్కుల నుంచి బయటపడటం ఆయన అనుచరుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.



## స్పీకర్ తీర్పును స్వాగతిస్తున్నా

**స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును నేను స్వాగతిస్తున్నా. నాకు ఎమ్మెల్యే అర్హతపై బీఆర్ఎస్ నాయకులు దాఖలు చేసిన పిటిషన్లకు ఎలాంటి చట్టబద్ధత లేదు. నేను ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉన్నాను. ఆ పార్టీ విధానాలు నచ్చక నేను దూరంగా ఉంటున్నా. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నేను రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నా. అదేం నేరం కాదు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు, నాటి పార్టీ అధినేత కేసీఆర్ ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నప్పుడు లేని నియమాలు ఇప్పుడు ఎందుకు తెరమీదకు వస్తాయి?**

**- ఎమ్మెల్యే కడియం**

### - కేసు నేపథ్యం ఇదీ..

బీఆర్ఎస్ తరపున గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారంటూ ఆ పార్టీ నేతలు గతంలో స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. కడియం శ్రీహరి కాంగ్రెస్ పెద్దలను కలిసిన ఫోటోలను, దానం నాగేందర్ కాంగ్రెస్ కండువాతో ప్రచారం చేసిన దృశ్యాలను ప్రధాన ఆధారాలుగా బిఆర్ఎస్ నేతలు సమర్పించారు. ముఖ్యంగా దానం నాగేందర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే కాంగ్రెస్ టికెట్‌పై పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని వారు గట్టిగా ప్రస్తావించారు. అయితే ఈ ఆధారాలు ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించడానికి సరిపోవని స్పీకర్ అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యేలు కేవలం అభివృద్ధి పనుల నిమిత్తమే ముఖ్యమంత్రిని కలిశారని, వారు అధికారికంగా పార్టీ సభ్యత్వం తీసుకోలేదన్న వాదనను స్పీకర్ పరిగణనలోకి తీసుకున్నారు.



### ప్రజాస్వామ్యం ఖూనీ

**- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చీకటి రోజని ఆయన అభివర్ణించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ బీ-ఫాం మీద ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్‌కు క్లీన్ చిట్ ఇవ్వడం కంటే దారుణం.. మరొకటి ఉండదని మండిపడ్డారు. ఇంతకంటే సాక్ష్యం ఏం కావాలని ఆయన స్పీకర్‌ను ప్రశ్నించారు. ఇది కేవలం ఒక తీర్పు కాదని, అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థలను ఉపయోగించే ఉదాహరణ అన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన పదవులను వ్యక్తిగత లాభాల కోసం మార్చుకుంటే, స్పీకర్ దానికి ముద్ర వేస్తే, ప్రజాస్వామ్య విలువలు ఎక్కడ నిలుస్తాయని ప్రశ్నించారు. ఇలాంటి నిర్ణయాలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయన్నారు. తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సరైన సమయంలో సమాధానం చెబుతారని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని కాపాడుతామని చెప్పే రాహుల్ గాంధీకి సిగ్గు ఉంటే దీనిపై సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నవారు తమ బలాన్ని ఉపయోగించి రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిరాయింపుదారులను రాళ్లతో కొట్టాలని గతంలో రేవంత్ రెడ్డి అన్నారని, ఇప్పుడు ఎవరిని కొట్టాలో ఆయనే చెప్పాలని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలు ఈ పరిణామాలన్నీ గమనిస్తున్నారని, సరైన సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు.

# గవర్నర్ గా శివ్ ప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం

- లోక్‌భవన్ వేదికగా వేడుక
- హాజరైన సీఎం రేవంత్, మంత్రులు
- తెలుగులో ప్రమాణ స్వీకారం చేసిన గవర్నర్
- కలిసి పనిచేద్దామని రాష్ట్ర ప్రభుత్వానికి పిలుపు

అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా బుధవారం రాజ్‌భవన్ (లోక్‌భవన్)లో అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆయనతో పదవీ ప్రమాణస్వీకారం చేయించారు. నూతన గవర్నర్ అనర్గళంగా తెలుగులో ప్రమాణస్వీకారం చేయడం అందరినీ ఆకట్టుకుంది. ఈ వేడుకకు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనమండలి చైర్మన్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, పలువురు ఉన్నతాధికారులు హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా రాష్ట్ర ప్రజలనుద్దేశించి కీలక సందేశం ఇచ్చారు. తెలంగాణ ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం తన అదృష్టమని ఆయన పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచిన రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం గొప్ప సాంస్కృతిక సంపదకు, విశిష్ట సంప్రదాయాలకు నెలవని కొనియాడారు. హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా తనకు ఉన్న అనుభవం తెలంగాణ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజం ఆశలకు, సరికొత్త ఆవిష్కరణలకు చిరునామా అని గవర్నర్ ప్రశంసించారు. ప్రజల దీక్ష, పట్టుదల వల్ల రాష్ట్రం అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఆయన మంత్రివర్గ సహచరులకు శుభాకాంక్షలు తెలుపుతూ రాజ్యాంగబద్ధంగా, నిజాయితీగా తన విధులను నిర్వహిస్తానని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ సుసంపన్నమైన తెలంగాణ నిర్మాణం కోసం ప్రభుత్వంతో కలిసి పని చేస్తానని గవర్నర్ తన సందేశంలో ఉద్ఘాటించారు.

# ఉద్యాన పంటల సాగుతోనే రైతులకు అధిక ఆదాయం

- గ్రామాల్లో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన
- జిల్లా ఉద్యాన అధికారి మరియన్న

మహబూబాబాద్, అక్షర దర్బార్: మార్కెట్ డిమాండ్ ఉన్న ఉద్యాన పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అధిక లాభాలు గడించవచ్చని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న తెలిపారు. బుధవారం దంతాలపల్లి, నర్సింహులపేట, పెదదవంగర, తొర్రూరు, నెల్లికుదురు, ఇనుగుర్తి మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించి ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు మొక్కలు, తోటల నిర్వహణ, బిందు సేద్యం కోసం ఎకరానికి రూ. 50,918 రాయితీ ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. అలాగే డ్రాగన్ ఫ్రూట్ కు రూ. 64,800, మామిడి, నిమ్మ, జామ తోటలకు రూ. 19,200 చొప్పున ప్రోత్సాహకాలు ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు సంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పి పందిరి కూరగాయలు, పూలు, పండ్లు, మల్బరీ సాగుపై దృష్టి సారించాలని ఆయన కోరారు. మల్చింగ్, బిందు సేద్యం, సేంద్రియ ఎరువుల వాడకం వంటి ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల ఎకరానికి లక్ష రూపాయల నికర ఆదాయం పొందవచ్చని సూచించారు. శాశ్వత పందిర్ల నిర్మాణానికి అర ఎకరానికి రూ. 50,000 సాయం అందుతుందని, మల్బరీ సాగుతో పాటు షెడ్ నిర్మాణానికి రెండు ఎకరాలకు రూ. 5 లక్షల రాయితీ లభిస్తుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి విజయపాల్ రెడ్డి, మైక్రో ఇరిగేషన్ ప్రతినిధులు అశోక్, ప్రసాద్ బాబు పాల్గొన్నారు.



# వంద శాతం ఉత్తీర్ణతతో పాటు మనో వికాసం సాధించాలి

అక్షర దర్బార్, నెల్లికుదురు/మహబూబాబాద్ : విద్యార్థులు చదువులో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు మానసిక వికాసం పెంపొందించుకోవాలని నెల్లికుదురు మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న సూచించారు. జిల్లా కలెక్టర్ స్నేహా శబరీష్ ఆదేశాల మేరకు బుధవారం ఆయన నెల్లికుదురులోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యా, వసతి, భోజన సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదవాలని, క్రీడలు, వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. వసతి గృహ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు నిత్యం వేడివేడి తాజా ఆహారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎవరికైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని, సొంత వైద్యం చేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి సతీష్ పాల్గొన్నారు.



## మరిపెడలో గంజాయి

# ముఠా గుట్టురట్టు

■ ఐదుగురు అరెస్ట్ – బైక్ స్వాధీనం



అక్షర దర్బార్, మరిపెడ : మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. విశాఖపట్నం జిల్లా అరకు ప్రాంతం నుండి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్న ఐదుగురిని బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు ఎస్ఐ టి. కోటేశ్వర రావు సిబ్బందితో కలిసి రాజీవ్ గాంధీ సెంటర్ సమీపంలో దాడులు నిర్వహించి నలుగురు యువకులతో పాటు ఒక మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి గంజాయి, రవాణాకు ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారిలో మరిపెడకు చెందిన లునవత్ ప్రవీణ్, బోడా కార్తీక్, బాణోత్ శివ, గార్ల మండలానికి చెందిన అభిషేక్ ఉన్నారు. నిందితులను సీఐ రాజ్ కుమార్ గౌడ్ విచారించి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## మైనర్లకు 'పాలీ గ్రిప్' ఇస్తే జైలుకే



■ భూపాలపల్లి పోలీసుల స్పెషల్ డ్రైవ్!

■ ఆటోమొబైల్, పంక్చర్ షాపుల్లో సీసీఎస్ పోలీసుల తనిఖీలు

■ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవు : ఎస్పీ సంకీర్త్

అక్షరదర్బార్, భూపాలపల్లి : చిన్నపిల్లల భవిష్యత్తును చిదిమేస్తున్న మత్తు పదార్థాల వినియోగంపై భూపాలపల్లి జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని పలు ఆటోమొబైల్ షాపులు, పంక్చర్ సెంటర్లు, బుక్ స్టాల్స్‌లలో సీసీఎస్ పోలీస్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. సాధారణంగా పంక్చర్లు అతికించడానికి వాడే పాలీ గ్రిప్ ట్యూబ్‌లు, పంక్చర్ సొల్యూషన్లను కొందరు మైనర్లు మత్తు కోసం ఉపయోగిస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో, 18 సంవత్సరాల లోపు పిల్లలకు ఇలాంటి పదార్థాలను విక్రయించడం తీవ్రమైన నేరమని పోలీసులు స్పష్టం చేశారు. వీటిని అధిక మోతాదులో పీల్చడం వల్ల పిల్లల నాడీ వ్యవస్థ దెబ్బతిని, ఆరోగ్యానికి తీవ్ర హాని కలుగుతుందని దుకాణదారులకు వివరించారు.

**- దుకాణదారులకు పోలీసుల సూచనలు**

అనుమానం వస్తే వయసు ధృవీకరణ పత్రం అడిగిన తర్వాతే విక్రయించాలి. చిన్నపిల్లలు పదేపదే ఇలాంటి పదార్థాల కోసం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. నిబంధనలు ఉల్లంఘించి విక్రయాలు జరిపితే షాపుల లైసెన్సుల రద్దుతో పాటు కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సంకీర్త్ హెచ్చరించారు. జిల్లాను మత్తు రహితంగా మార్చేందుకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని పోలీసులు కోరారు. ఈ తనిఖీల్లో సీసీఎస్ బృందం సభ్యులు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



## పరకాల వైద్యుడికి అరుదైన గౌరవం..

**భారతీయ నంది అవార్డు అందుకున్న డా. రోహిత్ సాదు**

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణానికి చెందిన ప్రముఖ ఫిజియోథెరపీ వైద్యుడు డా. సాదు రోహిత్‌కు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లోని స్ఫూర్తి సొసైటీ ఆధ్వర్యంలో ప్రదానం చేసే "భారతీయ నంది అవార్డు"ను ఆయన అందుకున్నారు. కరోనా సమయంలో ప్రజలకు అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును అందజేసినట్లు సొసైటీ ప్రతినిధులు తెలిపారు. పరకాల పట్టణంతో పాటు శాయంపేట, రేగొండ, నడికూడ, మొగుళ్లపల్లి మండలాల్లో ప్రజలకు ఫిజియోథెరపీ సేవలు అందిస్తూ మంచి గుర్తింపు పొందిన డా. రోహిత్ సాదుకు ఈ అవార్డు రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కరోనా మహమ్మారి సమయంలో అనేక మంది రోగులకు ఫిజియోథెరపీ సేవలు అందిస్తూ వారి ఆరోగ్య పునరుద్ధరణకు డా. రోహిత్ సాదు కృషి చేశారు. ఈ సేవలను గుర్తించిన స్ఫూర్తి సొసైటీ ఆయనకు భారతీయ నంది అవార్డు ప్రదానం చేసింది.

## రైతులకు రెండు రోజుల శిక్షణ

అక్షర దర్బార్,నడికూడ: నడికూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) సౌజన్యంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు రెండు రోజుల శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రానికి చెందిన శాస్త్రవేత్త డా. ఆర్. విశ్వాతేజ రైతులకు నానో ఎరువుల వినియోగం, సేంద్రియ వ్యవసాయం, నేల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.నానో యూరియా, నానో డిఏపీ వినియోగం వల్ల ఎరువుల వినియోగం తగ్గి పంటలకు అవసరమైన పోషకాలు సమర్థవంతంగా అందుతాయని తెలిపారు. సాయిల్ హెల్త్ కార్డుల ద్వారా భూమిలోని పోషక స్థాయిలను తెలుసుకుని అవసరమైన ఎరువులను మాత్రమే వినియోగించాలని సూచించారు. వరి, మొక్కజొన్న పంటల్లో వచ్చే చీడపీడలను సమగ్ర యాజమాన్య పద్ధతుల ద్వారా నియంత్రించవచ్చని చెప్పారు. తక్కువ నీటితో సాగు చేయగల నువ్వుల వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. మండల ఏవో పోరిక జైసింగ్ రైతులకు ప్రభుత్వ పథకాలు, యూరియా బుకింగ్ యాప్ వినియోగం, వ్యవసాయ యంత్రీకరణ పథకంపై వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుడ్ల మలహల్రావు, ఉప సర్పంచ్ తరిగొప్పుల సంపత్, ఏఈఓలు ప్రశాంత్, ప్రదీప్, రామకృష్ణ, గోపి తదితరులు పాల్గొన్నారు.




## వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**డాక్టర్ కిరణ్ రాజ్**



అక్షర దర్బార్, దుగ్గొండి: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13న దుగ్గొండి మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ కిరణ్ రాజ్ తెలిపారు. ఈ శిబిరంలో పిల్లల, స్త్రీరోగ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, కంటి, దంత వైద్యులు పాల్గొని రోగులకు పరీక్షలు చేసి చికిత్స అందించనున్నట్లు చెప్పారు. ప్రజలు గుర్తింపు కార్డు తీసుకుని వచ్చి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో హెచ్ఈఓ సాంబయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రేపు ప్రజాప్రతినిధులకు శిక్షణ

■ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆదేశాలు



అక్షరదర్బార్, హనుమకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి  సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఈనెల 12న నిర్వహించనున్న మున్సిపల్ ఛైర్మన్లు, కార్పొరేటర్లు, సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యుల శిక్షణా కార్యక్రమం నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలనను మరింత ప్రజలకు చేరువ చేయడం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం కోసం స్థానిక ప్రజాప్రతినిధులకు సమగ్ర అవగాహన కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. అందుకు అనుగుణంగా నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమానికి సంబంధించి శాఖల వారీగా మినిట్–టు–మినిట్ కార్యక్రమాన్ని రూపొందించి, అవసరమైన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక మార్చి 6 నుండి జూన్ 12 వరకు అమలు చేయబడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యాచరణను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడం, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన క్లియర్ చేయడం వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆరోగ్యం, రోడ్డు భద్రత (అరైవ్ అలైవ్ కార్యక్రమం), సంక్షేమ పథకాల అమలు, పిల్లల భద్రత, వ్యవసాయం, విద్య, యువత, మహిళల సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులకు వాటి గురించి స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు, అర్హులైన లబ్ధిదారులకు వాటిని చేరవేయడంలో ప్రజాప్రతినిధులు తీసుకోవలసిన చర్యలు, 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లక్ష్యాలు వంటి అంశాలను వివరించాలని తెలిపారు. అలాగే తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, మున్సిపల్ చట్టాలకు సంబంధించిన ముఖ్యాంశాలను ప్రజాప్రతినిధులకు సంక్షిప్తంగా వివరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు సులభంగా అర్థం చేసుకునే విధంగా ట్రైనర్ల సహాయంతో శిక్షణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్ రవి, డీఆర్‌డీఓ మేన శ్రీను, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## మున్సిపల్ ఆఫీస్ లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

అక్షరదర్బార్, మహబూబాబాద్: మహబూబాబాద్ పట్టణం లోని మున్సిపాలిటీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది, ఈ క్రమంలో గత రెండు మూడు రోజుల నుంచి జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులు అన్ని జిల్లా ప్రధాన కార్యాలయాల్లో ఫైళ్ల క్లియరెన్స్, సానిటేషన్, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు, జిల్లా కలెక్టర్ తన పర్యటనలో మున్సిపల్ కార్యాలయ పరిసరాలను పరిశీలించి ఫైళ్లను వెంటనే క్లియరెన్స్ చేయాలని, అనవసరమైన స్క్రాప్ ను వెంటనే ఖండం చేయాలని సూచించారు, సుమారు గంటన్నరకు పైగా కార్యాలయంలో ఆమె తనిఖీలు నిర్వహించి స్వయంగా ఫైళ్లను పరిశీలించారు, వివిధ పనుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలని, వారి సమస్యలను సావధానంగా పరిశీలించి వారికి తగిన విధంగా పరిష్కారం చూపాలని అన్నారు, మున్సిపల్ పరిధిలో అంతర్గత ఫైళ్ల క్లియరెన్స్, అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా చూడాలని, సానిటేషన్ షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని, ఆదేశించారు, కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్పర్సన్ గుగులోతు జ్యోతి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, తహసిల్దార్ రాజేశ్వరరావు, సంబంధిత అధికారులు ఉన్నారు.

## గ్రామీణ ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు

**తాడ్వాయిలో మెగా కంటి వైద్య శిబిరం**

అక్షర దర్బార్, ములుగు : మారుమూల గ్రామాల ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భూక్య జంపన్న ఆధ్వర్యంలో తాడ్వాయి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం 26వ విడత ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరానికి తాడ్వాయి మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. నిపుణులైన వైద్యులు కంటి చూపు తగ్గడం, అలర్జీలు, ముత్యబిందు వంటి సమస్యలను గుర్తించి అవసరమైన వారికి ఆపరేషన్ కోసం హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రికి పంపించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం పట్ల స్థానికులు భూక్య జంపన్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంట ప్రవళిక–గున్ను, ఉపసర్పంచ్ దుర్గం నవీన్, మాజీ ఉపసర్పంచ్ ఆలేటి ఇంద్రారెడ్డి, తుమ్మల రాజేందర్ పాల్గొన్నారు.



# చిట్టీల పేరుతో రూ.5 కోట్లకు టోకరా

- నిందితుడు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏసీసీ సతీష్ బాబు



అక్షర దర్బార్, శాయంపేట: చిట్టీలు, అధిక వడ్డీ పేరుతో ప్రజలను నమ్మించి రూ.5 కోట్లకుపైగా మోసం చేసిన వ్యక్తిని శాయంపేట పోలీసులు అరెస్టు చేసినట్లు పరకాల ఏసీపీ సతీష్ బాబు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం... శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన పెరుమాండ్ల కిషోర్ రెడ్డి 2011 నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా "పెరుమాండ్ల చిట్స్" పేరుతో 117 మందితో చిట్టీలు వేయించి రూ.1.49 కోట్లను తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడు. అలాగే అధిక వడ్డీ ఆశ చూపించి మరో 59 మంది వద్ద నుంచి రూ.3.55 కోట్ల అప్పులు తీసుకుని చెల్లించకుండా మోసం చేశాడు. మొత్తంగా 176 మంది వద్ద నుంచి రూ.5,04,89,500 వసూలు చేసి తిరిగి ఇవ్వకపోవడంతో బాధితుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడు తీసుకున్న డబ్బులతో కొనుగోలు చేసిన ప్లాట్లు, వ్యవసాయ భూములు, బంగారం–వెండి ఆభరణాలు, నగదు, కారు తదితర ఆస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ అనుమతి లేని చిట్టీలలో చేరేముందు వివరాలు పరిశీలించాలని, అధిక లాభాలు చూపే స్కీములపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ సూచించారు. కేసును ఛేదించిన సీఐ రంజిత్ రావు, ఎస్సై పరమేశ్వర్ మరియు సిబ్బందిని ఆయన అభినందించారు.

## గ్రామదేవతలకు ఎమ్మెల్యే జీఎస్సార్ పూజలు

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలం కొప్పుల గ్రామంలో జరిగిన పెద్దమ్మ తల్లి బోనాల సందర్భంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే కొత్తపల్లి గోరి మండలం రాజక్కపల్లి గ్రామంలో పోచమ్మ తల్లిని కూడా స్థానిక నాయకులతో కలిసి దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గొప్ప పండుగ అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే అమ్మవారి జాతరలు ప్రజలను ఒకచోట చేర్చే ఆధ్యాత్మిక ఉత్సవాలని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం పెద్దకోడేపాక గ్రామానికి చెందిన తడక వెంకట్రాములు మరణించిన విషయం తెలుసుకుని ఆయన నివాసానికి వెళ్లి మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



## 28న జాతీయ లోక్ అదాలత్

**- న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి నాగరాజ్**

అక్షరదర్బార్, భూపాలపల్లి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అన్ని కోర్టు ప్రాంగణాల్లో ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఏ నాగరాజ్ తెలిపారు. బుధవారం న్యాయవాదులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజీ మార్గాన్ని ఎంచుకొని వివాద రహిత జీవితాలను గడిపేలా కక్షిదారులను ప్రోత్సహించాలని సూచించారు. కేసుల్లో రాజీపడితే ఇరువర్గాలకు మంచిదని అన్నారు. పెద్ద ఎత్తున కేసులు పరిష్కారానికి కృషి చేయాలని న్యాయవాదులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ ప్లీడర్ బొట్ల సుధాకర్, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి శ్రీనివాస చారి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పుప్పాల శ్రీనివాస్, అదనపు పీపీ ఎండి రఫీక్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే అక్షయ, న్యాయవాదులు పి బిక్షపతి, రావుల రమేష్, సుభాష్, ఎల్ విష్ణు, మొయినుద్దీన్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.




## 'క్రషర్, డాంబర్ ప్లాంట్ ను మూసివేయాలి'

అక్షర దర్బార్, శాయంపేట: పత్తిపాక గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్టోన్ క్రషర్ బోర్ బ్లాస్టింగులు చేస్తూ ప్రకృతి సంపదకు నష్టం కలిగిస్తోందని, అనుమతులు లేని డాంబర్ ప్లాంట్‌ను తక్షణమే మూసివేయాలని ఉపసర్పంచ్ తుడుం రాజు, వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. క్రషర్, డాంబర్ ప్లాంట్‌ల నుండి వెలువడుతున్న దుమ్ము, ధూళి వల్ల వ్యవసాయం దెబ్బతింటోందని, పశువులు, రైతుల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. వార్డు సభ్యులు వీరప్రతాప్, ప్రమీల సారయ్య, గజ్జి రాజు, సాయి లక్ష్మి , మహేందర్ ఉన్నారు.

## పీహెచ్ సీలో స్పెషలిస్ట్ క్యాంప్

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం స్పెషలిస్ట్ వైద్యుల ప్రత్యేక క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి కృష్ణ తెలిపారు. ఈ క్యాంప్‌లో స్త్రీరోగ నిపుణులు, పిల్లల వైద్యులు, ఆర్థోపెడిక్ డాక్టర్, కంటి వైద్యుడు, జనరల్ ఫిజిషియన్, దంత వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు పరీక్షలు నిర్వహించి చికిత్స అందించనున్నట్లు చెప్పారు. శాయంపేట ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## పురుగుల మందు దుకాణాల్లో తనిఖీ

అక్షర దర్బార్ నూగూరు వెంకటాపురం : వెంకటాపురం మండలంలోని మందుల షాపులను ములుగు జిల్లా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మందుల దుకాణాలలోని రికార్డులను పరిశీలించారు. రికార్డు నిర్వహణ సరిగా చేయని మందుల దుకాణాలకు షోకాస్ నోటీసులు జారీ చేశారు. అనంతరం తగు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా డ్రగ్గిస్ట్ కెమిస్ట్ ప్రధాన కార్యదర్శి బచ్చు పూర్ణచంద్రరావు, మందుల షాపు దుకాణదారులు అంకారావు, నరహరి, రాంబాబు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మూడో డిస్కం

- రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ అని నామకరణం
- పంటలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా బాధ్యతలు
- సీఎండీగా ముషారఫ్ అలీ ఫరూఖీ నియామకం

**అక్షరదర్బార్, హైదరాబాద్ :**

తెలంగాణ విద్యుత్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే సేవలు అందిస్తున్న టీఎస్ ఎస్పీడీసీఎల్, టీఎస్ ఎన్పీడీసీఎల్ సంస్థలకు అదనంగా రాష్ట్రంలో మూడవ విద్యుత్ పంపిణీ సంస్థను ఏర్పాటు చేస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త డిస్కమ్‌కు 'తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్' అని పేరు ఖరారు చేశారు. ఈ సంస్థ ఏర్పాటుతో విద్యుత్ పరిపాలనలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. కొత్తగా ఏర్పడిన ఈ డిస్కమ్ బాధ్యతలను ప్రభుత్వం సమర్థవంతమైన అధికారులకు అప్పగించింది. సీనియర్ ఐఏఎస్ అధికారి ముషారఫ్ అలీ ఫరూఖీని ఈ సంస్థకు



చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) గా నియమించారు. ఆయనతో పాటు సంస్థ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు మరో నలుగురు డైరెక్టర్లను కూడా ప్రభుత్వం నియమించింది. ఈ నియామకాల ద్వారా సంస్థ కార్యకలాపాలను తక్షణమే ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ కొత్త డిస్కమ్ కేవలం సాధారణ విద్యుత్ పంపిణీకే పరిమితం కాకుండా ప్రత్యేక లక్ష్యాలతో పనిచేయనుంది. ప్రధానంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల నిర్వహణ, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసే బాధ్యతను ఇది చూసుకుంటుంది. రైతులు కోరుకునే కొత్త కనెక్షన్ల మంజూరు ప్రక్రియ కూడా ఈ సంస్థ పరిధిలోకి వస్తుంది. వ్యవసాయంతో పాటు రాష్ట్రంలోని భారీ మరియు మధ్యతరహా ఎత్తిపోతల పథకాలకు అవసరమైన విద్యుత్ సరఫరాను ఈ సంస్థ పర్యవేక్షిస్తుంది. ప్రజా అవసరాలకు సంబంధించిన కీలక ప్రాజెక్టులకు కూడా ఈ డిస్కమ్ విద్యుత్ సేవలు అందించనుంది. మిషన్ భగీరథ పథకం, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ మరియు మున్సిపల్ వాటర్ సప్లై స్కీమ్‌లకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్ల బాధ్యతను ప్రభుత్వం టీజీఆర్పీడీసీఎల్ కు అప్పగించింది. సాధారణ వినియోగదారులు మరియు పరిశ్రమల లోడ్ నుంచి వ్యవసాయం, భారీ ప్రభుత్వ ప్రాజెక్టుల లోడ్‌ను వేరు చేయడం వల్ల పంపిణీ వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ విద్యుత్ రంగంలో చేపట్టిన అతిపెద్ద సంస్కరణగా దీనిని పేర్కొనవచ్చు. విద్యుత్ లోడ్ల విభజన వల్ల అడ్మినిస్ట్రేషన్ మరింత సులభతరం కావడమే కాకుండా రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా వేగంగా పరిష్కారం లభించే అవకాశం ఉంది. ప్రభుత్వ ప్రాజెక్టులకు, వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ఈ మూడవ డిస్కమ్ పనిచేయనుంది.



## ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

అక్షర దర్బార్, నూగూరు వెంకటాపురం : ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని మండల ఏవో నవీన్ తెలిపారు. రాచపల్లిలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. క్రిమిసంహారక, రసాయన మందుల వాడకం తగ్గించడం ద్వారా పెట్టుబడి తగ్గి, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. 125 మంది రైతులకు క్లస్టర్ గా ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఏఈఓ శ్యాం కుమార్, సీఆర్పీలు శాంతకుమారి, వెంకటలక్ష్మి ,రైతులు పాల్గొన్నారు.

### సీపీఐ రాష్ట్ర చీఫ్ తో

## రేపు దేవ్ జీ భేటీ

అక్షరదర్బార్, హైదరాబాద్ : ఇటీవల జనజీవన స్రవంతిలో చేరిన మావోయిస్టు పార్టీ చీఫ్ తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ బృందం గురువారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం 'మఖ్దూం భవన్' లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును మర్యాదపూర్వకంగా కలవనున్నారు. సాయుధ పోరాటాన్ని వీడి ప్రజాస్వామ్య మార్గంలోకి వచ్చిన ఈ నేతలకు సాదర స్వాగతం పలికేందుకు సీపీఐ శ్రేణులు సిద్ధమయ్యాయి. ఈ భేటీలో పార్టీ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కూనంనేని విజ్ఞప్తి చేశారు. సమావేశం ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కమ్యూనిస్టులు ఆకాంక్షిస్తున్న సమసమాజ స్థాపన కోసం మావోయిస్టులు మాతృపార్టీ అయిన సీపీఐలో చేరాలని కూనంనేని సాంబశివరావు ఇటీవల బహిరంగంగానే పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో దేవ్‌జీ బృందం మఖ్దూం భవన్‌కు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని పార్టీ వర్గాలు చెబుతున్నప్పటికీ, దీని వెనుక బలమైన రాజకీయ అంతరార్థం ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# 108 మంది మావోల లొంగుబాటు

- వీరిలో 44 మంది మహిళలు
- అందరి తలలపై కలిపి రూ.3.29 కోట్ల రివార్డు
- భారీగా నగదు, ఆయుధ సామాగ్రి లభ్యం



అక్షరదర్బార్, రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో బుధవారం 108 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరందరూ తమ ఆయుధాలను అధికారులకు అప్పగించి జనజీవన స్రవంతిలో కలిశారు. జగదల్ పూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లొంగిపోయిన వారిపై ప్రభుత్వం గతంలో మొత్తం రూ.3.29 కోట్ల భారీ రివార్డును ప్రకటించింది. లొంగిపోయినవారిలో 44 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. పోలీసులు వీరి నుంచి భారీగా ఆయుధాలను, నగదును స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారి వద్ద నుంచి 101 ఆయుధాలు లభ్యమయ్యాయి. వీటితో పాటు పోలీసులు ఒక భారీ డంపును కూడా కనుగొన్నారు. ఆ డంపులో రూ.3.61 కోట్ల నగదు లభించింది. సుమారు రూ.1.64 కోట్ల విలువ చేసే ఒక కిలో బంగారాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ పోలీసుల చరిత్రలో ఇది ఒక అతిపెద్ద విజయంగా అధికారులు భావిస్తున్నారు. మావోయిస్టుల పునరావాస పథకం రాష్ట్రంలో అత్యంత ప్రభావవంతంగా అమలు అవుతోంది. దీని ఫలితంగానే గత 26 నెలల్లో ఛత్తీస్‌గఢ్ వ్యాప్తంగా మొత్తం 2,714 మంది మావోయిస్టులు ఆయుధాలు వీడి సాధారణ జీవితంలోకి వచ్చారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, పోలీసుల అవగాహన కార్యక్రమాల వల్ల లొంగుబాట్లు పెరుగుతున్నాయి. మావోయిస్టుల బలం క్రమంగా తగ్గుతోందని పోలీసులు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

## రామప్ప ఉప ఆలయాలకూ జాతీయ హోదా

- భారత పురావస్తు సర్వేక్షణా సంస్కృతి మంత్రిత్వ శాఖ గెజిట్
- గొల్లల గుడి, శివతారకేశ్వర ఆలయాలకు మహర్దశ

అక్షరదర్బార్, వరంగల్ : వరల్డ్ హెరిటేజ్ సైట్ రామప్ప దేవాలయ కీర్తి కిరీటంలో మరో మైలురాయి చేరింది. ములుగు జిల్లాలోని రామప్ప ప్రధాన ఆలయానికి సమీపంలో ఉన్న గొల్లల గుడి, శివతారకేశ్వర స్వామి ఉప ఆలయాలను జాతీయ ప్రాముఖ్యత కలిగిన స్మారక చిహ్నాలుగా గుర్తిస్తూ భారత ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. భారత పురావస్తు సర్వేక్షణా సంస్కృతి మంత్రిత్వ శాఖ ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నట్లు బుధవారం ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండెంట్ నిహిల్ దాస్ అధికారికంగా వెల్లడించారు. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ఈ రెండు ఉప ఆలయాలను పరిరక్షించేందుకు కేంద్ర పురావస్తు శాఖ ఇప్పటికే ప్రత్యేక చర్యలు చేపట్టింది. శిథిలావస్థకు చేరుకున్న ఈ కట్టడాలకు అవసరమైన మరమ్మతులు నిర్వహించి, వాటిని తిరిగి పూర్వ వైభవంతో భక్తులు మరియు పర్యాటకుల సందర్శనార్థం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి జరుగుతోంది. జాతీయ హోదా లభించడం వల్ల ఈ ఆలయాల నిర్వహణ మరియు అభివృద్ధికి కేంద్రం నుంచి నేరుగా నిధులు అందే అవకాశం ఉంది. ఈ గెజిట్ నోటిఫికేషన్ పై ఎవరికైనా ఏవైనా అభ్యంతరాలు ఉంటే రెండు నెలల గడువులోగా కేంద్ర పురావస్తు శాఖకు తెలియజేయాలని నిహిల్ దాస్ సూచించారు.

## గుట్కా అంబర్ ప్యాకెట్ల పట్టివేత

అక్షరదర్బార్, శంభునిపేట: గుట్కా అంబర్ ప్యాకెట్ల నిల్వలపై వరంగల్ మిల్స్ కాలనీ పోలీసులు దాడి జరిపారు. వరంగల్ శంభునిపేటలో గల లింగమూర్తి జనరల్ స్టోర్ లో నిల్వ ఉన్న గుట్కా అంబర్ ప్యాకెట్లను బుధవారం పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై మిల్స్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సమాచారం. అయితే వరంగల్ లో గుట్కా అంబర్ ప్యాకెట్ల డీలర్ల వద్ద పెద్ద మొత్తంలో గుట్కా నిల్వలు ఉండగా శంభునిపేటలో పోలీసులు ఒక జనరల్ స్టోర్ లో దాడులు జరిపి గుట్కా అంబర్ నిలువలను పట్టుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

## ప్రేమ పేరుతో టోకరా

- యువకుడి నుంచి రూ.20 లక్షలు వసూలు చేసిన కిలాడీ మహిళ
- మోసపోయానని గుర్తించిన బాధితుడు
- పోలీసులకు ఫిర్యాదు

అక్షరదర్బార్, భూపాలపల్లి: మ్యాట్రిమోనీలో ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగా మారి, చివరకు ఒక యువకుడిని నిండా ముంచిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వెలుగుచూసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సదరు మహిళ యువకుడి నుండి లక్షలాది రూపాయలు కాజేసింది. వర్ధన్నపేటకు చెందిన ఒక యువకుడికి, భూపాలపల్లికి చెందిన మహిళతో ఒక మ్యాట్రిమోనీ సైట్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్తా ప్రేమకు దారితీయడంతో, వారిద్దరూ గత కొంతకాలంగా సన్నిహితంగా ఉంటున్నారు. తననే పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన సదరు మహిళ, వివిధ కారణాలు చెబుతూ సదరు యువకుడి వద్ద నుండి విడతల వారీగా సుమారు రూ.20 లక్షలు వసూలు చేసింది. డబ్బు తీసుకున్న తర్వాత పెళ్లి విషయం ఎత్తకుండా సదరు మహిళ తప్పించుకు తిరుగుతుండటంతో, తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు చివరకు పోలీసులను ఆశ్రయించాడు. బుధవారం ఈ విషయమై సదరు యువకుడు భూపాలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915